(సమగ్ర తెలుగు డిజిటల్ దినపత్రిక)

# ప్రజావేదిక

PRAJA VEDIKA TELUGU DAILY

తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 4 సంచిక : 188 (కాంప్లిమెంటరీ కాపీ) ఎడిటర్:వెంకన్న 16-04 - 2026 పేజీలు : 6 Digital Edition







# భారత్‌లో తొలిసారి..

- హైదరాబాద్‌లో యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్ ఫ్యూచర్ సిటీలో శాశ్వత ప్రాంగణం..
- తాత్కాలికంగా లేక్ వ్యూ గెస్ట్ హౌస్
- 2027-28 విద్యా సంవత్సరం నుంచి కోర్సులు ప్రారంభమయ్యే అవకాశం
- హైదరాబాద్‌ను గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చే దిశగా ప్రభుత్వ అడుగులు



హైదరాబాద్

హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'యూనివర్సిటీ ఆఫ్ లండన్' తమ తొలి భారతీయ ఆఫ్‌షోర్ క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. ఐటీ, బయోటెక్ రంగాల్లో ఇప్పటికే అంతర్జాతీయ ఖ్యాతి పొందిన నగర కీర్తి కిరీటంలో ఈ పరిణామం మరో కలికితురాయిగా నిలవనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీలోని ఎడ్యుకేషన్ జోన్‌లో 2లో



## ఈ విషయంలో మనమంతా ఏకమవుదాం

- చంద్రబాబు సహా దక్షిణాది రాష్ట్రాల సీఎంలకు రేవంత్ రెడ్డి లేఖ
- లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై సీఎంలకు లేఖలు రాసిన రేవంత్ రెడ్డి
- జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని ఆందోళన
- ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ సీఎంలకు రేవంత్ రెడ్డి లేఖ

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక చర్యలు చేపట్టారు. జనాభా ప్రాతిపదికన ఈ ప్రక్రియ చేపడితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఐక్య పోరాటానికి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌లకు ఆయన లేఖలు రాశారు. ఈ అంశంపై దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసికట్టుగా ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.లోక్‌సభ సీట్ల సర్దుబాటును దక్షిణాది రాష్ట్రాల రాజకీయ హక్కులపై జరుగుతున్న దాడిగా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. 2లో



## మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేసీఆర్ పూర్తి మద్దతు..

డీలిమిటేషన్ కారణంగా దక్షిణాదికి ఇప్పుడున్న 24 శాతం సీట్లు తగ్గకూడదని వార్నింగ్ మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన గళాన్ని వినిపించారు. ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ లో పార్టీ ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్ రావులతో నిర్వహించిన భేటీలో జాతీయ రాజకీయ పరిణామాలు, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. 2లో

### బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం..

## వికారాబాద్‌లో కల్వకుంట్ల కవిత గర్జన


పరిగి ప్రాంత రైతుల నుంచి సాగు భూములను లాక్కుంటున్నారంటూ కవిత ధర్నా

అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని వ్యాఖ్య



రైతుల సమ్మతి లేకుండా ఒక్క ఎకరా భూమి కూడా తీసుకోవడానికి వీల్లేదన్న కవిత పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు. వికారాబాద్ ఆర్‌డీవో కార్యాలయం వద్ద వందలాది మంది రైతులతో కలిసి ఆమె భారీ ధర్నా నిర్వహించారు. 2లో

## హైదరాబాద్ సహా పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక



**తెలంగాణలో పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**

**రానున్న మూడు రోజుల్లో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం**

వడగాలులు వీచే జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. 2లో

## మేము నిర్మాణాత్మక చర్చలకే ప్రాధాన్యత ఇస్తాం: ఇరాన్ అధ్యక్షుడు



హైదరాబాద్: ఇరాన్‌ను బలవంతంగా లొంగదీసుకోవాలని చేసే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుంది అని బుధవారం ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ హెచ్చరించారు. తాజాగా పాకిస్తాన్‌లో జరిగిన శాంతి చర్చలు విఫలమవ్వడంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహావేశంతో హార్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని ప్రకటించాడు. 2లో



### పురుషుల్లో జ్ఞాపకశక్తి తగ్గడానికి ఉప్పు కారణమా?

ఆస్ట్రేలియాలోని ఈడీత్ కోవాన్ యూనివర్సిటీ పరిశోధనలో కీలక విషయాలుఉప్పు ఎక్కువగా వాడటం వల్ల పురుషుల్లో జ్ఞాపకశక్తి వేగంగా క్షీణిస్తుందన్న అధ్యయనం 2లో

## నాకు తొమ్మిది హామీలు కావాలి : ప్రధాని మోడీ



ప్రధాని నరేంద్ర మోడీ కర్ణాటకలోని ఆదిచుంచనగిరి మఠాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 పనుల గురించి మోడీ హామీ తీసుకున్నారు. 2లో

# భారత్‌లో తొలిసారి..

మొదటిపేజీ తరువాయి

ఈ విశ్వవిద్యాలయం శాశ్వత క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. దీని నిర్మాణం పూర్తయ్యే వరకు, నగరం నడిబొడ్డున ఉన్న లేక్ వ్యూ గెస్ట్ హౌస్‌ను తాత్కాలిక ప్రాంగణంగా వినియోగించుకోవడానికి ప్రభుత్వం అనుమతించింది. 2027-28 విద్యా సంవత్సరం నాటికి కోర్సులను ప్రారంభించే లక్ష్యంతో వర్సిటీ ప్రతినిధులు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు (యూజీసీ) దరఖాస్తు ప్రక్రియను వేగవంతం చేశారు. 1836లో స్థాపించిన యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూకేలోని అత్యంత పురాతన ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల్లో ఒకటి. క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో టాప్-500లోపు ఉన్న విదేశీ వర్సిటీలనే భారత్‌లో అనుమతించాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు ఇది పూర్తిస్థాయిలో అనుగుణంగా ఉంది. లండన్ బిజినెస్ స్కూల్, కింగ్స్ కాలేజ్ వంటి 17 ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల సమాఖ్యగా ఇది పనిచేస్తోంది.

తెలంగాణను అన్ని రంగాల్లో గ్లోబల్ లీడర్‌గా నిలపాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే 13 ప్రతిష్ఠాత్మక యూకే పాఠశాలల ప్రతినిధులు కూడా హైదరాబాద్‌లో తమ శాఖల ఏర్పాటుకు ఆసక్తి చూపారు. ఈ పరిణామంతో స్థానిక విద్యార్థులు తక్కువ ఖర్చుతో అంతర్జాతీయ స్థాయి విద్యను పొందడంతో పాటు, నగరంలోని ఐటీ, బయోటెక్ సంస్థలకు నైపుణ్య మానవ వనరులు మరింతగా అందుబాటులోకి వస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

## హైదరాబాద్ సహా పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక

**తెలంగాణలో పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**

**రానున్న మూడు రోజుల్లో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం**

వడగాలులు వీచే జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ

ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. రానున్న మూడు రోజుల్లో కూడా ఉష్ణోగ్రతలు క్రమంగా ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈరోజు నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

# నాకు తొమ్మిది హామీలు కావాలి : ప్రధాని మోడీ

**ప్రధాని నరేంద్ర మోడీ కర్ణాటకలోని ఆదిచుంచనగిరి మఠాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 పనుల గురించి మోడీ హామీ తీసుకున్నారు.**

**"మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కోసం మీరంతా నాకు వాటిపై ప్రమాణం చేయండి. ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతో పాటు దేశ అభివృద్ధి వేగంగా జరుగుతుంది" అని మోడీ వెల్లడించారు. ప్రధాని అడిగిన హామీలు ఏంటంటే..**

**నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడదాం.**

**పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిద్దాం**

**అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం.**

**'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుదాం.**

**జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేద్దాం.**

**రసాయనాలు లేకుండా పంట సాగు చేద్దాం.**

**ఆహారంలో మిల్లెట్స్‌ని భాగం చేసుకుందాం.**

**నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిద్దాం.**

**ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుతూ, ప్రకృతికి సేవ చేద్దాం**

**ఇక, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని మోడీ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని గుర్తుచేశారు.**

## మేము నిర్మాణాత్మక చర్చలకే ప్రాధాన్యత ఇస్తాం: ఇరాన్ అధ్యక్షుడు

హైదరాబాద్: ఇరాన్‌ను బలవంతంగా లొంగదీసుకోవాలని చేసే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుంది అని బుధవారం ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ హెచ్చరించారు. తాజాగా పాకిస్తాన్‌లో జరిగిన శాంతి చర్చలు విఫలమవ్వడంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహావేశంతో హార్మూజ్ జలసంధిని దిగ్భంధిస్తామని ప్రకటించాడు. అనుకున్నట్టుగానే ఇరాన్ పోర్టులకి వెళ్లే నౌకల్ని అమెరికా సైన్యం అడ్డుకుంది. ఈ తాజా పరిణామాలపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ స్పందించారు. ఇరాన్‌పై బలప్రయోగం చేసే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుందని ఆయన హెచ్చరించారు. 'మేము నిర్మాణాత్మక చర్చలకే ప్రాధాన్యత ఇస్తాము. ఇరాన్‌ను లొంగిపోయేలా బలవంతం చేసే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుంది. ప్రజలు అటువంటి విధానాన్ని ఎన్నటికీ అంగీకరించరు. ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదు అని ఇరాన్ ప్రభుత్వ మీడియా ఐఎస్ఎన్ఎకి ఆయన వెల్లడించారు.కాగా, ఏ అధికారంతో, ఏ నేరానికి పాల్పడి మా దేశంపై దాడి జరిగింది. అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించి పౌరులను, ఉన్నత వర్గాలను, పిల్లలను లక్ష్యంగా చేసుకోవడం, పాఠశాలలు, ఆసుపత్రులతో సహా కీలక కేంద్రాలను ధ్వంసం చేయడాన్ని అమెరికా ఎలా సమర్థించుకుంటుంది అని ఆయన మీడియా ద్వారా ప్రశ్నించారు. తమ దేశం శాంతిని, దౌత్య సంబంధాలను కోరుకుంటుంది. అయితే దాని సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే ఎలాంటి బాహ్య దురాక్రమణనైనా లేదా ఒత్తిడినైనా గట్టిగా ప్రతిఘటిస్తుందని ఇరాన్ అధ్యక్షుడు పునరుద్ఘాటించారు.

# పురుషుల్లో జ్ఞాపకశక్తి తగ్గడానికి ఉప్పు కారణమా?

ఆస్ట్రేలియాలోని ఈడీత్ కోవాన్ యూనివర్సిటీ పరిశోధనలో కీలక విషయాలు

ఉప్పు ఎక్కువగా వాడటం వల్ల పురుషుల్లో జ్ఞాపకశక్తి వేగంగా క్షీణిస్తుందన్న అధ్యయనం

గత అనుభవాలను గుర్తుంచుకునే సామర్థ్యంపై ఉప్పు ప్రభావం చూపుతుందని వెల్లడి

ఆహారంలో ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల పురుషుల్లో జ్ఞాపకశక్తి వేగంగా క్షీణిస్తుందని ఆస్ట్రేలియాలో జరిగిన ఒక తాజా అధ్యయనం వెల్లడించింది. మెదడు ఆరోగ్యంపై మనం తీసుకునే ఆహారం ఎంత ప్రభావం చూపుతుందో ఈ పరిశోధన స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా, వ్యక్తిగత అనుభవాలు, గత సంఘటనలను గుర్తుంచుకునే సామర్థ్యం (ఎపిసోడిక్ మెమరీ)పై అధిక సోడియం ప్రతికూల ప్రభావం చూపుతుందని బుధవారం ఈడీత్ కోవాన్ యూనివర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 1,208 మందిపై 72 నెలల (6 ఏళ్లు) పాటు నిరంతర పర్యవేక్షణ జరిపారు. వారి ఆహారపు అలవాట్లను, జ్ఞాపకశక్తి మార్పులను విశ్లేషించారు. అధికంగా ఉప్పు తీసుకున్న పురుషుల్లో జ్ఞాపకశక్తి వేగంగా తగ్గినట్టు గుర్తించారు. అయితే, మహిళల్లో మాత్రం ఇలాంటి సంబంధం కనిపించకపోవడం గమనార్హం.శరీరానికి సోడియం అవసరమే అయినప్పటికీ, దానిని ఎక్కువగా తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు వస్తాయని ఇప్పటికే రుజువైంది. మెదడులో వాపు, రక్తనాళాలు దెబ్బతినడం, మెదడుకు రక్త ప్రసరణ తగ్గడం వంటి కారణాల వల్ల జ్ఞాపకశక్తిపై ప్రభావం పడొచ్చని పరిశోధకురాలు సమంత గార్డెనర్ అభిప్రాయపడ్డారు. దీని వెనుక ఉన్న కచ్చితమైన కారణాలపై మరింత లోతైన పరిశోధన జరగాల్సి ఉందన్నారు.

ఇదే సమయంలో, ఇజ్రాయెల్‌లో జరిగిన మరో అధ్యయనం ప్రకారం.. కాలక్రమేణా జ్ఞాపకాలు మసకబారినా, ఒక సంఘటనను ఎందుకు గుర్తుంచుకున్నామో చెప్పే వివరణలు మాత్రం స్థిరంగా ఉంటాయని తేలింది. జ్ఞాపకంపై విశ్వాసం తగ్గినా, దానికి ఇచ్చే కారణాలు మాత్రం బలంగా ఉంటాయని పరిశోధకులు తెలిపారు.

# తెలంగాణలో పెరగనున్న లోక్ సభ స్థానాలు..!

హైదరాబాద్: ఈనెల 16న మహిళ రిజర్వేషన్ బిల్లుతో పాటు పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనుంది. దేశంలోని ఆయా రాష్ట్రాల లోక్ సభ స్థానాల సంఖ్యలో పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ నేపథ్యంలో అందుకు అనుగుణంగా తెలంగాణ లోక్ సభ స్థానాల సంఖ్య పెరగనుంది. ప్రస్తుతమున్న వాటిని విభజించి కొత్తగా మరో 9 లేదా 10 లోక్‌సభ స్థానాలు ఏర్పాటు చేస్తారని అంచనా. దీంతో తెలంగాణ లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య 17 నుంచి 26 లేదా 27కు పెరగనుంది. పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. దీంతో జనాభా అధికంగా ఉన్నా ఆయా జిల్లాల్లో



లోక్ సభ స్థానాలు పెరగనున్నాయి. అత్యధికంగా రంగారెడ్డి ఉమ్మడి జిల్లా 52,96,741 జనాభాతో రాష్ట్రంలో మొదటిస్థానంలో, దేశంలో 17వ ర్యాంకులో ఉంది.అదే విధంగా పార్లమెంట్ స్థానాల్లో మహిళలకు 33శాతం కల్పించే బిల్లుకు కేంద్రం ఆమోదం తెలపనుంది. తెలంగాణ మహిళలకు కేటాయంచే స్థానాలు పెరగనున్నాయి.ప్రస్తుతం తెలంగాణ నుంచి లోక్‌సభలో ఇద్దరు మహిళా ఎంపీలు డీకే అరుణ, కడియం కావ్య మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 9 మంది మహిళలు తెలంగాణ తరఫున లోక్‌సభలో అడుగుపెట్టనున్నారు. ప్రస్తుత బిల్లు ఆమోదం పొందితే 2029 ఎన్నికల్లో కచ్చితంగా ప్రతి పార్టీ వారికి 9 టికెట్లు ఇవ్వాల్సిందే. 2024 ఎన్నికల్లో అన్ని లోక్‌సభ స్థానాలకు కలిపి 12,459 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. వారిలో 8,360 మంది చివరికి బరిలో నిలిచారు. వీరిలో మహిళలు 800(9.6%) మంది మాత్రమే ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో 33 శాతానికి వారి వాటా పెరగనుంది. దేశవ్యాప్తంగా 47.63 కోట్ల మంది మహిళా ఓటర్లున్నారు.

# ఈ విషయంలో మనమంతా ఏకమవుదాం

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక చర్యలు చేపట్టారు. జనాభా ప్రాతిపదికన ఈ ప్రక్రియ చేపడితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఐక్య పోరాటానికి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌లకు ఆయన లేఖలు రాశారు. ఈ అంశంపై దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసికట్టుగా ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.లోక్‌సభ సీట్ల సర్దుబాటును దక్షిణాది రాష్ట్రాల రాజకీయ హక్కులపై జరుగుతున్న దాడిగా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. "దక్షిణాదిపై జరుగుతున్న ఈ దాడిని ఎదుర్కోవడానికి మనమంతా ఏకం కావాలి. ఢిల్లీలో మన గొంతుకను కాపాడుకోవాలి" అని తన లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను అనుసరించి జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసినందుకు దక్షిణాది రాష్ట్రాలకు బహుమతికి బదులుగా శిక్షపడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, రాజకీయంగా ప్రాబల్యం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఈ ప్రమాదాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అందరికంటే ముందుగానే గుర్తించారని రేవంత్ రెడ్డి ప్రశంసించారు. గత సంవత్సరం మార్చిలోనే చెన్నైలో దక్షిణాది రాష్ట్రాల నేతలతో సమావేశం నిర్వహించారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ స్ఫూర్తితో అందరూ కలిసి ముందుకు సాగాలని కోరారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన సిద్ధాంతాలను గుర్తుచేస్తూ "చైతన్యవంతులను చేయండి, ఆందోళన చేయండి, సంఘటితం కండి" అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు."దక్షిణ భారతదేశానికి అత్యంత కీలకమైన ఈ విషయంలో మనమంతా ఏకం కావాలని ఈ లేఖ రాస్తున్నాను. రాజకీయ హక్కులపై జరుగుతున్న ఈ దాడిని మనం ఎదిరించి, ఢిల్లీలో మన గొంతుకను కాపాడుకోవాలి" అంటూ లేఖలో పేర్కొన్నారు. ఈ తీవ్రమైన సమస్యపై అందరూ కలిసి ముందుకు సాగాలని, ఐక్యంగా కవాతు చేద్దామని రేవంత్ తన లేఖను ముగించారు.

## మహిళా రిజర్వేషన్లకు అనుకూలంగా గతంలోనే తీర్మానం చేశామన్న కేసీఆర్

**డీలిమిటేషన్ కారణంగా దక్షిణాదికి ఇప్పుడున్న 24 శాతం సీట్లు తగ్గకూడదని వార్నింగ్**

మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన గళాన్ని వినిపించారు. ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ లో పార్టీ ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్ రావులతో నిర్వహించిన భేటీలో జాతీయ రాజకీయ పరిణామాలు, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ... చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. గతంలోనే తాము అసెంబ్లీలో దీనికి అనుకూలంగా తీర్మానం చేశామని గుర్తు చేస్తూ, రాజ్యసభలో తమ ఎంపీలు ఈ బిల్లుకు మద్దతు తెలుపుతారని స్పష్టం చేశారు.ఇదే సమయంలో... నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై కేసీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం ఎంపీ సీట్లు ఉన్నాయని... జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల సీట్ల శాతం (ప్రస్తుతం ఉన్న 24 శాతం) తగ్గకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఒకవేళ దక్షిణాది ప్రయోజనాలకు విఘాతం కలిగితే రాజీలేని పోరాటం చేస్తామని కేంద్రానికి హెచ్చరికలు జారీ చేశారు.ఈ నెల 20న జగిత్యాలలో జరగనున్న భారీ బహిరంగ సభ, అలాగే ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని కేటీఆర్, హరీశ్ రావులను ఆదేశించారు.

## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉధృతం: వికారాబాద్‌లో కల్వకుంట్ల కవిత గర్జన

పరిగి ప్రాంత రైతుల నుంచి సాగు భూములను లాక్కుంటున్నారంటూ కవిత ధర్నా

అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని వ్యాఖ్య

రైతుల సమ్మతి లేకుండా ఒక్క ఎకరా భూమి కూడా తీసుకోవడానికి వీల్లేదన్న కవిత

పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద వందలాది మంది రైతులతో కలిసి ఆమె భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భూసేకరణ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.తాతల కాలం నాటి సారవంతమైన భూములను నమ్ముకుని బతుకుతున్న అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని కవిత ఈ సందర్భంగా మండిపడ్డారు. రైతుల సమ్మతి లేకుండా ఏ ఒక్క ఎకరా భూమిని తీసుకోవడానికి వీల్లేదని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశ్రామికీకరణ ముసుగులో భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత పిలుపుతో ఈ ఆందోళనలో స్థానిక నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వికారాబాద్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. కవిత రాకతో ఈ భూపోరాటం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సిరాజుద్దీన్

కల్లూరు, ఏప్రిల్ 15
ప్రజా వేదిక న్యూస్ ప్రతినిధి



ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యవర్గంలో కల్లూరు పట్టణానికి చెందిన షేక్. సిరాజుద్దీన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితు లయ్యారు. ఈ మేరకు టిపీసిసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు డిసీ సీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిరాజుద్దీన్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి జిల్లా బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎమ్మెల్యే మట్టా రాగమయి లకు కృతజ్ఞతలు తెలిపారు.

## సీమంత వేడుకల్లో పాల్గొన సర్పంచ్ పర్చ రామచంద్రరావు



చింతకాని ఏప్రిల్ 15 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు

చింతకాని మండలం చిన్నమండవ గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో 1,2 గర్భవతులకు సీమంతం కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. సర్పంచ్ పర్చ రామచంద్రరావు ఆధ్వర్యంలో గర్భిణులకు పసుపు, కుంకుమ, స్వీట్లు, పూలు, పండ్లు, చీర, గాజులతో సాంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తంగిరాల మాధవి, వార్డ్ సభ్యులు గుండ్ల బేబీ రాణి, గుండ్ల భద్రమ్మ , పచ్చగాని వెంకటరములు , గుండ్ల అనిల్ కుమార్ , పల్లె దావకాన డాక్టర్ అనీల్ కుమార్, ఏఎన్ఎం లలిత కుమరి, ఆశా వర్కర్స్ బుచమ్మ, అరుణ సిడిపిఓ చావా కమల ప్రియ, సూపర్వైజర్ పద్మవతి అంగన్వాడీ టీచర్స్ లింగం నిర్మల , నంద్రు జ్యోతి పాల్గొన్నారు..

## నాదాందేళ్ల కాంతారావు భౌతిక కాయానికి నివాళులు అర్పించిన తిర్లాపురం సర్పంచ్ వీరబాబు

చింతకాని ఏప్రిల్ 15 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు



చింతకాని మండలపరిధిలోని తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన నాదాందేళ్ల కాంతారావు అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా విషయం తెలుసుకున్న తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు బుధవారం ఉదయం నాదాందేళ్ల కాంతారావు భౌతిక కాయానికి సందర్శించిపూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు తిర్లాపురం గ్రామ సెక్రెటరీ ఉమారాణి, తిమ్మినేనిపాలెం గ్రామ సెక్రెటరీ శశి, తిర్లాపురం గ్రామపంచాయతీ సిబ్బంది చాపలమడుగు సైదులు,సీతా రాములు చాపలమడుగు నాగరాజు,కొమ్ము బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 18వ తేదీన హైదరాబాద్ లో జరిగే టీయుఎఫ్ సదస్సును విజయవంతం చేయండి.

-టీయుఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని శ్రీనివాస్ రెడ్డి.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 15.



తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన హైదరాబాదులో నిర్వహించే సదస్సును విజయవంతం చెయ్యాలని మహబూబాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ప్రధానకార్యదర్శి నాయిని శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యమకారుల డిమాండ్లను అమలు చేసుకోవడం కోసం కదిలిరావాలని,ఉద్యమకారులకు కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో లో పెట్టిన 250 గజాల స్థలము,25 వేల రూపాయల పెన్షన్ ఇస్తానని రెండు సంవత్సరాలకు పైగా కావస్తున్న ప్రభుత్వానికి ఎలాంటి స్పందన లేదని,ఈ నెల 18వ తారీకు శనివారం ఉదయం 10 గంటలకు హైదరాబాదు తార్నాకలో మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాలులో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సదస్సు ను విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు.ముఖ్యముగా మహబూబాబాద్ జిల్లాలోని ఉద్యమకారులందరూ రాష్ట్ర స్థాయి నుండి మండల స్థాయి గ్రామస్థాయి నాయకులు అత్యధికంగా పాల్గొనాలన్నారు.ఈ మీటింగ్ కు ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు చీమ సీనన్న పాల్గొంటారన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్సీ విజయశాంతి,ఉద్యమకారుడు కోదండరామ్,మానకొండూరు ఎమ్మెల్యే, డాక్టర్ సత్యనారాయణ,ఇతర నాయకులు ఉద్యమకారులు కళాకారులు మహిళా నాయకురాలు యావత్ తెలంగాణ ఉద్యమకారులందరూ పాల్గొని ఈ సదస్సును విజయవంతం చెయ్యాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు.

## ఆదర్శ గ్రామ సమాఖ్య పందిళ్లపల్లి పరిధిలో నాటుకోళ్ల పెంపకం , పంపిణీకార్యక్రమం.

చింతకాని ఏప్రిల్ 15 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు

ఈరోజు పందిల్లపల్లి గ్రామంలో నాటు కోళ్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కొండపల్లి శ్రీరామ్ మాట్లాడుతూ పల్లెల్లో వ్యవసాయంకు అనుబంధంగా
నాటు కోళ్ల పెంపకం కూడా చేపట్టి మహిళలు నాటుకోళ్ల, నాటు గుడ్లు ఆహారంగా తీసుకుంటూ ఆరోగ్యంతో పాటు ఆదాయం కూడా పొందాలి.ఆరోగ్యంగా ఉండటం వలన పని దినాలు పెరగడం వలన ఆదాయం పెరుగుతుంది.
ప్రభుత్వం ఇందిరా మహిళ శక్తి కార్యక్రమం ద్వారా పొదుపు సంఘాల మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చే కార్యక్రమంలో భాగంగా మదర్ యూనిట్ పెరటికోళ్ళ పెంపకం కార్యక్రమాన్ని ఈ మండలంలో ఈ గ్రామం లో చేయడం జరిగింది.
ఈ మదర్ యూనిట్ నుండి మండలంలోని అన్ని గ్రామాలకు నాటు కోళ్ల పంపిణీ జరిగి తీసుకున్న సభ్యులు కూడా వాటిని జాగ్రత్తగా పోషణ చేసి మదర్ యూనిట్ మాదిరిగా కోడి పిల్లలకు పోషణ సక్రమంగా చేసి వాటి ద్వారా ఆదాయం పొందుతూనే నాటుకోడి నాటు గుడ్లు ద్వారా కూడా ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఆదాయాన్ని కూడా పెంచుకోవాలి.ఈ ఇందిరా మహిళా శక్తి



కార్యక్రమం ద్వారా వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు చేయడానికి గొర్రెల పెంపకం పందులు పెంపకం కౌజు పిట్టలు పెంపకం డెయిరీ కూడా ఉన్నాయి అనుభవం ఆసక్తిగలవారు సంఘ సభ్యులుగా ఉన్న ఎవరైనా ఈ కార్యక్రమాలు చేసుకోవచ్చు.
వ్యవసాయ అనుబంధ కార్యక్రమాల ద్వారా సభ్యులకు సమయం కలిసొస్తుంది.
అదేవిధంగా ఇందిరా మహిళ డెయిరీ నందు కూడా గడ్డి పెంపకం నకు చాప కట్టర్ కు కూడాను రుణాల అందించడం జరుగుతుంది.
ప్రభుత్వం అందించే ప్రతి కార్యక్రమాన్ని మహిళా సంఘాలు ఉపయోగించుకొని సక్రంగా బ్యాంకులింకేజీ స్త్రీ నిధి రుణాలు సకాలంలో చెల్లించి వడ్డీ లేని రుణాలు అత్యధిక పొందాలి.
ఏపీ డీ జయశ్రీ మాట్లాడుతూ రుణాలు అధికంగా పొందాలి మంచిగా చెల్లింపులు ఉండాలి చెల్లింపులు అన్నీ కూడా డిజిటల్ పద్ధతిలో జరగాలని రుణాలు పిఎం ఎఫ్ఎంఈ పీఎంఈజీపి వంటి కార్యక్రమాలు ద్వారా కూడా పొంది మహిళలు మీకు అనుభవం ఉన్న వ్యాపారాలు చేసుకుంటూ వ్యాపారవేత్తలుగా మారాలి అని తెలియజేశారు.
వెటర్నరీ డాక్టర్ రాంజీ నాటు కోళ్ల పెంపకం పోషన వాతావరణానికి అనుగుణంగా ఎలా పోషణ చేయాలి ఎలా ఆదాయం పొందాలని సూచనలు చేయడం జరిగింది
ఈ కార్యక్రమంలోసర్పంచ్ వత్సవాయి పద్మ, ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, ఏపీడి ఈజీఎస్ రామకృష్ణ డిపిఎం ఫామ్ శ్రీనివాసరావు, ఏపిఎం ఫామ్ శ్రీనివాసరావు,మధిర ఇందిరా మహిళా డెయిరీ ఏపిఎం లక్ష్మణరావు, చింతకాని ఏ పి ఎం నాగ పుల్లా రావు, ఏపీవో కోటయ్య,ఆత్మ కమిటీ డైరెక్టర్ సట్టు వెంకటేశ్వర్లు,సీసీలు భాస్కరరావు,నరేందర్ రెడ్డి వెంకటేశ్వర్లు,ఝాన్సీ నాగమణి,మండలసమైఖ్య కార్యదర్శి తుడుం వాణి,మదర్ యూనిట్ లబ్ధిదారురాలుఅలవాల విజయలక్ష్మి,అన్ని గ్రామసమాఖ్యల అధ్యక్షురాలలు వివోఏలు పాల్గొన్నారు.

## తిర్లాపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేసిన గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో.....

చింతకాని ఏప్రిల్ 15 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు

చింతకాని మండలం తిర్లాపురం గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత,భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్135వ జయంతి సందర్భంగా తిర్లాపురం గ్రామములో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ చేయడం జరిగింది . ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, డాక్టర్ సోమలింగం వరంగల్, చాపల మడుగు పిచ్చయ్య, అంబేద్కర్ నాగరాజు చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేసి ఆయన విగ్రహానికి కొబ్బరికాయ కొట్టి పూలదండలేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. ఆశయాలను,అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషిని



కొనియాడారు.ఈ సందర్భంగా డాక్టర్ సోమలింగం మాట్లాడుతూ..మాట్లాడుతూ అట్టడుగు వర్గంలో జన్మించి ఎన్ని అవాంతరాలు ఎదురొచ్చినా ఉన్నత చదువులు చదివిన గొప్ప వ్యక్తి ఆంబేద్కర్ అని అన్నారు. తదనంతరం కేక్ కట్ చేసి అంబేద్కర్ జయంతి వేడుకలు విషెస్ చెప్పారు అంబేద్కర్ యూత్ సభ్యులకు గ్రామ సర్పంచ్ అంబేద్కర్ టీ షర్టు బహుకరణ చేశారు. వీధుల్లో ఆయన నినాదాలతో అంబేద్కర్ సాంగులతో డాన్స్ చేశారు.ఈ కార్యక్రమంలో తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, డాక్టర్ సోమలింగం, చాపలమడుగు పిచ్చయ్య, అంబేద్కర్ నాగరాజు, చాపల మడుగు సైదులు, నాలుగో వార్డ్ సభ్యులు చాపలమడుగు మధు,ఐతం కిషోర్, సువర్ణ కంటి శ్రావణ్ కుమార్ , ఏడో వార్డు సభ్యుడు దారెల్లి సురేష్, కొమ్ము చంద్రావు, ఐతం రమేష్, చాట్ల అశోక్, చాపలమడుగు నరేష్,చాపల మడుగు సతీష్, చాపలమడుగు మనోజ్, ఐతం అన్వేష్, చాపల మడుగు జోగయ్య , యువతీ యువకులు, యూత్ పిల్లలు, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మినేనిపాలెం గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన గ్రామ సర్పంచ్

- ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఆధ్వర్యంలో

చింతకాని ఏప్రిల్ 15 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు

చింతకాని మండల పరిధిలో తిమ్మినేనిపాలెం గ్రామంలో బుధవారంరోజు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి తిమ్మినేనిపాలెం గ్రామ సర్పంచ్ కొమ్ము ప్రభు, కూచిపూడి బుచ్చిబాబు, అంబటి వెంకటేశ్వర్లు,కొబ్బరికాయ కొట్టి పారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..తెలంగాణలో యాసంగి సీజన్ మొక్కజొన్న పంటకు మద్దతు ధర కల్పించేందుకు, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను వేగంగా ప్రారంభిస్తోంది. క్వింటాలుకు ?2400 మద్దతు ధరతో ఎకరానికి 26. 5 క్వింటాలతో పి ఏ సి ఎస్ కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయి. రైతులు దళారులను ఆశ్రయించకుండా ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకుసూచించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలోనాగులవంచ సొసైటీ సీఈవో యాలముడి శ్రీనివాసరావు, గ్రామ



మాజీ సర్పంచులు, మాజీ ఉపసర్పంచ్లు,సొసైటీ మాజీ డైరెక్టర్లు, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### రాపల్లి గ్రామంలోని యువశక్తి యూత్ ఆధ్వర్యంలో

## ఘనంగా జరిగిన అంబేద్కర్ జయంతి వేడుక....

బోనకల్ ఏప్రిల్ 15 ప్రజావేదిక ప్రతినిధి (తెల్లబోయిన సుమన్)

డా.బి.ఆర్.అంబేద్కర్ ఆశయాల కోసం పని చేస్తున్న యువత ఈసారి వినూత్నంగా అనాథ ఆశ్రమాలకు,మరియు వృద్ధాశ్రమలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏనుగు గాంధీ యువతకి ఎప్పుడు అన్ని విషయాలలో అండగా ఉంటానని,అందరూ ఆర్థికంగా కుటుంబంలో స్థిరపడాలని సందేశాన్ని ఇచ్చారు. ముఖ్య నాయకులు మోదుగు నాగేశ్వరావు మాట్లాడుతూ యువశక్తి యూత్ చేసే ప్రతి పనికి తాను చేదోడువాదోడుగా ఉంటానని మాట ఇచ్చారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ పెద్దలు ముఖ్య నాయకులు పిల్లలు యువ శక్తి యూత్ సభ్యులు అందరూ పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరిగా పోలీస్ వారి ఆదేశాల మేరకు ట్రాఫిక్ సందేశాన్ని గ్రామ ప్రజలకు అందిస్తూ ప్రతిజ్ఞ చేసి పాటిస్తామని మాటిచ్చి జై భీమ్ తెలియజేశారు.



## చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనియం ఎస్ఐ కూచిపూడి జగదీష్,



### -హస్నాబాద్ గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు,

తిరుమలాయపాలెం ఏప్రిల్ 15
( ప్రజా వేదిక) న్యూస్.ఆ ప్రతినిధి

వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని. తిరుమలాయపాలెం మండల ఎస్సై కూచిపూడి జగదీష్ అన్నారు. మండలంలోని. హస్నాబాద్ గ్రామం బొడ్రాయి సెంటర్లో గ్రామ సర్పంచ్ కొవ్వూరి పద్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన. చలివేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ,జిల్లాల లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు.మండల ప్రజలు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు రావొద్దని పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. బయటకు వస్తే టోపీ, తలపాగా వంటివి తప్పనిసరిగా ధరించాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో

**బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు**

కొవ్వూరు సత్తి రెడ్డి, కీసర సంకీర్తన రెడ్డి, కొవ్వూరి సందీప్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ గ్రామ కార్యదర్శి పల్లి వినోద్, మేటబోతుల శ్రీనివాస్ (పెద్ద), మోటపోతుల చిన్న శ్రీనివాస్, మగి వెంకన్న, కొత్తపల్లి వెంకటరెడ్డి, నర్సింహారెడ్డి,కొవ్వూరు వెంకరెడ్డి, తండా అంజయ్య, పసాలది రవి,మాగి లక్ష్మణ్, పల్లి భాస్కర్, పల్లి అశోక్, పల్లి నవీన్,సన్నాయల యాదగిరి, భిక్షం రెడ్డి మాగి నరేష్, గుండా వీరన్న, సంకా భాస్కర్,పల్లి వెంకన్న,పురం మల్లయ్య, గ్రామ ప్రజలు. తదితరులు పాల్గొన్నారు,

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే.



బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 15.

బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీలో దేశిని కొమురయ్య దిశ దినకర్మలకు ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య హాజరైన కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి కుమారులు దేశిని రాంబాబు,దేశిని నగేష్,దేశిని శీనులను పరామర్శించి మనోధైర్యాన్ని నింపారు.వారితో పాటు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి,కొత్తపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్, సపవత్ రాందాస్ నాయక్, సర్పంచ్ లింగా నాయక్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు గ్రామ పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ను కలిసిన ఇల్లందు ఎమ్మెల్యే.



బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 15.

మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ని వారి కార్యాలయంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ తో మాట్లాడుతూ గార్ల బయ్యారం మండలాలకు సంబంధించిన అనేక అభివృద్ధి పనులకు,పెండింగ్ వర్క్ లకు సంబందించిన అంశాలపై మాట్లాడినట్లు తెలిపారు.రబిలో పండించిన మొక్కజొన్న రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, సంబంధిత అధికారులు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్ ని ఎమ్మెల్యే కనకయ్య కోరారు.ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి,కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ తదితరులు ఉన్నారు.

## గ్రామీణ అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాల పెంపు లక్ష్యం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క





కల్లూరు, ఏప్రిల్ 15
ప్రజా వేదిక న్యూస్ ప్రతినిధి :

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండలంలో పర్యటించారు.

ముందుగా కల్లూరు మండలంలో నారాయణపురం గ్రామంలో 2 కోట్ల 75 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి శంకుస్థాపన చేసి, 10 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించిన వైద్య విధాన పరిషత్‌కు చెందిన 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి గ్రామానికి నాణ్యమైన విద్యుత్, వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యమని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల పరిసర పలు గ్రామాలకు చెందిన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతోనే ప్రజా ప్రభుత్వం చిత్తశు ద్ధితో ముందుకు వెళుతున్నదని తెలిపారు. 33/11 కేవి విద్యుత్ ఉపకేంద్రం ద్వారా పరిసర గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా మెరుగుప డుతుందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు సమీపంలోనే మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ ఆసుపత్రి కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, విద్యుత్, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, డిసిహెచ్ఎస్ డా.రాజశేఖర్,వైద్యాధికారులు, విద్యుత్ శాఖ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నిస్సహాయకులకు,మహిళలకు చేయూతగా నిలుస్తోన్న చేతన ఫౌండేషన్.





### -పోలీసు అధికారుల ప్రశంసలు..
### -లబ్ధిదారుల కళ్ళలో ఆనందం..

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 15.

బయ్యారం మండలం కొత్తపేట పంచాయతీ గంధంపల్లి రైతు వేదికలో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పేద ప్రజల ఉపాధికి దోహదపడే విధంగా వివిధ ఉపకరణాల పంపిణీ బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పోలీసు అధికారులు చేతన ఫౌండేషన్ సేవలను కొనియాడారు.ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డప్పటికీ స్వగ్రామాన్ని మరవకుండా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చేతన ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెనిగళ్ళ రవి కుమార్ సేవా భావం ప్రశంసనీయం అని మహబూబాబాద్ డిఎస్పీ నంబూరి తిరుపతిరావు పేర్కొన్నారు.విదేశాల్లో ఉంటూ కూడా స్వదేశ ప్రజల అభ్యున్నతికి కృషి చేయడం గొప్ప విషయం అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు 13 తోపుడు బండ్లు,మూడు పిండి మిల్లులు, మూడు ఇస్త్రీ పెట్టెలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఎల్మాస్ మాగ్నెటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తమ సిఎస్ఆర్ సంస్థ నిధులు అందించగా చేతన ఫౌండేషన్ సభ్యులు గ్రామంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.చేతన ఫౌండేషన్ ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులు చేతన ఫౌండేషన్ వారికీ కృతజ్ఞతలు తెలిపారు.

చేతన ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెనిగళ్ళ రవి కుమార్ మార్గదర్శకత్వంలో బంధుమిత్ర బృందం రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం వారి నిస్వార్థ సేవకు నిదర్శనం అని డిఎస్పి తిరుపతి రావు అన్నారు.ఇటువంటి మంచి కార్యక్రమాలకు పోలీసు శాఖ నుండి ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా ప్రవీణ్ కుమార్,సిఐ రవీందర్,ఎస్ఐ తిరుపతి,చేతన ఫౌండేషన్ కెనడా ప్రతినిధి సీతారామారావు,సంస్థ అధ్యక్షుడు వెనిగళ్ళ అనిల్ కుమార్,ఉపాధ్యక్షుడు వెనిగళ్ళ వెంకటేశ్వరరావు,జాయింట్ సెక్రటరీ దొడ్డా సీతారామయ్య, సభ్యులు తాతా గణేష్,నవీన్,రషీద్, తోటకూర అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. ఎస్సై పొదిలి వెంకన్న..

బోనకల్ ఏప్రిల్ 15
ప్రజావేదిక ప్రతినిధి తెల్లబోయిన సుమన్

బోనకల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న ఒక వాహనాన్ని చిరునోముల సమీపంలో ఆపి తనిఖీ చేయగా, అశోక్ లైలాండ్ బడా దోస్త్ వాహనంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు.నిందితుల వివరాలు: ఎస్ కే యుషప్ పాషా సన్నాపూర్ మౌలాలి 40 సంవత్సరాలు ముస్లిం ఖమ్మం రమన్ గుట్ట వాహనం వివరాలు వాహనం: అశోక్ లేలాండ్ బడా దోస్త్



రంగు: గ్రే రిజిస్ట్రేషన్ నం:టీఎస్ 06 యు డి 5561

పోలీసుల విచారణలో, నిందితులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ లాభం కోసం ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తేలింది.పోలీసులు వాహనాన్ని మరియు ఇసుకను స్వాధీనం చేసుకొని, నిందితులపై సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పొదిలి వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పోలీసుల చర్య అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ప్రజలకు హెచ్చరిస్తున్నారు.

## నిఘా నీడలో బయ్యారం పెద్ద చెరువు.



**బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 15.**

బయ్యారం పెద్ద చెరువు వద్ద రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అనధికారంగా తూములను లేపి నీటిని వృధా చేయడం గత మూడు రోజులుగా జరుతున్నట్లు సమాచారం. ఇలా తూములను లేపడం వల్ల పంట పొలాలకు అందాల్సిన నీరు వృధా అవ్వడం జరుగుతుంది.ఇలాంటి చర్యల వల్ల యాసంగీ పంటకు అనుమతించబడిన రైతులకు పంటలకు తగిన నీరు అందకుండా ఇబ్బందులు కలగవచ్చని గమనించిన నీటిపారుదల శాఖ అధికారులు ఈ సమస్యను నివారించుటకు చెరువు భద్రతను మెరుగుపరుచుటకు చెరువు తూము సమీపంలో సీసీ కెమరాలను ఏర్పాటు చేసినట్లు నీటి పారుదల శాఖ డిఈఈ నాగార్జున సాగర్ బుధవారం తెలిపారు.

## పాము కాటుతో మహిళ మృతి



**బోనకల్ ఏప్రిల్ 15 ప్రజా వేదిక (ప్రతినిధి తెల్లబోయిన సుమన్)**

పాము కాటుకు గుర్రై మహిళ మృతి చెందిన సంఘటన  మండల పరిధిలోని పెద్దబీరవల్లి గ్రామంలో బుధవారం జరిగింది.స్థానికులు,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని  పెద్దబీరవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ గ్రామ శాఖ అద్యక్షులు పంది వెంకులు  పెద్ద కోడలు పంది వరలక్ష్మి (40) భర్త నరసింహారావు బుధవారం ఉదయం తమ వ్యవసాయ పొలంలో మొక్కజోన్న కంకులు విరుస్తున్న సమయంలో వరలక్ష్మీ పాము కాటుకు గుర్రైంది.చికిత్స కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండుగా పరిస్థితి విషమించి మరణించినట్లు తెలిపారు.వరలక్ష్మికీ ఒక కుమార్తె,కుమారుడు ఉన్నారు.వరలక్ష్మి మృతీతో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి...

## చర్చలు జరపండి..
## సమస్యలు పరిష్కరించండి

**ఆర్టిజన్ల సమ్మెకు మద్దతుగా కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ధర్నా**

**లేబర్ కమిషనర్‌కు వినతి**

హైదరాబాద్

గత 8 రోజులుగా సమ్మె చేస్తున్న విద్యుత్ ఆర్టిజన్ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఆర్టిజన్ల సమ్మెకు మద్దతుగా బుధవారం హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించాయి. సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజరు కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షులు కె.సూర్యం, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాస్‌లు మాట్లాడారు. ”తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో 19 వేల మంది ఆర్టిజన్లు. 1400 మంది అన్‌మెన్, పీస్ రేట్ కార్మికులు సమ్మె చేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా పాలకులు ఇచ్చిన హామీలే ఈ సమ్మెలో డిమాండ్లుగా ఉన్నాయి. గతంలో ఇచ్చిన ఆ హామీలు ఆచరణలో అమలు కాలేదు. ట్రాన్స్‌కో, జెన్కో, ఉత్తర, దక్షిణ డిస్కంలకు చెందిన 20 వేల మంది ఆర్టిజన్లు తమ న్యాయమైన సమస్యల పరిష్కరించాలని ఏండ్లుగా ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అయినా ప్రభుత్వం, విద్యుత్ సంస్థ యాజమాన్యం స్పందించలేదు. ఉద్యోగులు అనివార్యంగా సమ్మెలోకి దిగవలసి వచ్చింది. గత 8 రోజులు నుంచి సమ్మె ఐక్యంగా ఉధృతంగా కొనసాగుతున్నది. న్యాయమైన డిమాండ్లను చర్చల ద్వారా ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించి సమ్మెను నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వం ఆ దిశలో చర్యలు తీసుకోలేదు. సమ్మెను అణిచివేసే ప్రయాత్నాలను చేస్తున్నది. సమ్మె చేస్తున్న కార్మికులను ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తున్నది. విధుల నుంచి తొలిగిస్తున్నట్లుగా టర్మినేషన్ ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. గతంలో నుండి పొందుతున్న కొన్ని రాయితీలకు కోతలు పెడుతున్నారు. తక్షణమే స్పందించి ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించి కొనసాగుతున్న సమ్మెను నివారించాలి” అని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం లేబర్ కమిషనర్‌ను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, వివిస్.రావు, భూపాల్, కార్యదర్శులు కూరపాటి రమేష్, పి.శ్రీకాంత్, పి.సుధాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సోమన్న, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దశరథ్, జె కుమారస్వామి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు ఆర్‌డీ.చంద్రశేఖర్, ఏఐటీయూసీ నర్సింహా, టీయూసీఐ ప్రవీణ్, ఐఎఫ్‌టీయూ అరుణక్క విద్యుత్ జెఏసి రాష్ట్ర నాయకులు కె. ఈశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

# హార్ముజ్‌ను తెరుస్తున్నాం



## -చైనా కోసం...ప్రపంచం కోసమే : ట్రంప్

ఇరాన్ యుద్ధం ముగియబోతోంది

రెండో విడత చర్చలకు దౌత్య యత్నాలు

వాషింగ్టన్‌లో ఇజ్రాయిల్, లెబనాన్ రాయబారుల భేటీ

వాషింగ్టన్ : ప్రపంచ దేశాల కోసం హార్ముజ్ జలసంధిని శాశ్వతంగా తెరుస్తున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ‘హార్ముజ్ జల సంధిని నేను శాశ్వతంగా తెరిచినందుకు చైనా చాలా సంతోషిస్తోంది. నేను చైనా కోసం...ప్రపంచం కోసం ఆ పని చేశాను. ఈ పరిస్థితి ఇకపై ఎన్నడూ ఉత్ప న్నం కాదు. ఇరాన్‌కు ఆయుధాలు పంపరాదని వారు అంగీకరించారు. కొన్ని వారాల క్రితం నేను అక్కడికి వెళ్లినప్పుడు అధ్యక్షుడు జిన్‌పింగ్ నన్ను పెద్దగా, బలంగా హత్తుకున్నారు. మేము కలిసి పనిచేసుకుం టున్నాం’ అని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. కాగా ఇరాన్‌కు ఆయుధాలు అందించవద్దని జిన్‌పింగ్‌కు లేఖ రాశా నని ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇరాన్‌కు చైనా ఆయుధాలు అందిస్తోం దని తాను విన్నానని, అలా చేయవద్దని కోరుతూ లేఖ రాశానని చెప్పారు. తాను అలా చేయడం లేదని జిన్‌పింగ్ ప్రత్యుత్తరం ఇచ్చారని అన్నారు.

**ఇరాన్ యుద్ధం ముగియబోతోంది**

ఇరాన్‌పై మొదలు పెట్టిన యుద్ధం త్వరలోనే ముగియబోతోందని అమెరికా అధ్యక్షుడు చెప్పారు. యుద్ధాన్ని సైనిక చర్యతో ముగించబోవడం లేదని ఆయన తెలిపారు. ఇరాన్‌తో రెండో విడత చర్చలకు అమెరికా సిద్ధమవుతున్న వేళ ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ‘మాపని ఇంకా పూర్తి కాలేదు. మేము నిష్క్రమిస్తే ఇరాన్ పునర్నిర్మాణానికి 20 సంవత్సరాలు పడుతుంది. ఏం జరుగుతుందో చూద్దాం. ఒప్పందం చేసుకోవాలని వారు బలంగా కోరుకుంటున్నారని నేను అనుకుంటున్నాను’ అని ట్రంప్ చెప్పారు. ఫాక్స్ బిజినెస్ ప్రతినిధితో ట్రంప్ బుధవారం మాట్లాడుతూ ఇరాన్‌పై ప్రత్యక్ష దాడి చేయాలన్న తన నిర్ణయాన్ని సమర్ధించుకున్నారు. ఇరాన్ అణు సామర్థ్యాన్ని నిర్మూలించడానికి ఆ చర్య అవసరమని అన్నారు. ‘నేను ఆ పనిచేయకపోతే ఇరాన్ వద్ద ఇప్పటికే అణ్వాయుధం ఉండేది. ఒకవేళ వారి వద్ద అణ్వాయుధం ఉంటే మీరు వారిని సర్ అని వినయంగా పిలవాల్సి వచ్చేది. అలా జరగాలని ఎవరూ కోరుకోరు’ అని ట్రంప్ చెప్పారు. అలాగే పదివేల మందితో యూఎస్ బలగాలు పశ్చిమాసియాలో మకాం వేసి ఉన్నట్టు తెలిపారు.

**హార్ముజ్‌లో నౌకల రవాణాను అనుమతించండి : అమెరికాను కోరిన సౌదీ**

హార్ముజ్ జలసంధి మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ఇరాన్‌తో చర్చలు జరపాలని అమెరికా ప్రభుత్వాన్ని సౌదీ అరేబియా కోరింది. లేకుంటే ప్రాంతీయ, ఆర్థిక సంక్షోభం తీవ్రతరమవుతుందని హెచ్చరించింది. హార్ముజ్ మూసివేతకు ప్రతీకారంగా గల్ఫ్‌కు ఆవల ఇరాన్ దాడులు చేయవచ్చునని, ఇతర కీలక సముద్ర మార్గాలను అడ్డుకోవచ్చునని అరబ్ అధికారులు వాషింగ్టన్ పోస్ట్ పత్రికకు తెలియజేశారు. సౌదీ అరేబియాలోని కీలక బాబ్ అల్-మందెబ్ జలసంధిని ఇరాన్ లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉన్నదని సౌదీ ఆందోళన చెందుతోంది. ఎర్ర సముద్రంలోని ఈ జలసంధి ద్వారానే సౌదీ నుంచి చమురు ఎగుమతులు ఎక్కువగా జరుగుతుంటాయి. బాబ్ ఎల్-మందెబ్‌ను మూసివేయాలని ఇరాన్ అనుకుంటే హౌతీలు జత కలుస్తారని యెమన్ నిపుణుడు ఆడం బరన్ చెప్పారు. గాజా ఘర్షణ సమయంలో హౌతీలు తమ సామర్థ్యాన్ని ప్రదర్శించారని ఆయన గుర్తు చేశారు.

**రెండో విడత చర్చలకు దౌత్య యత్నాలు వాషింగ్టన్‌లో ఇజ్రాయిల్, లెబనాన్ రాయబారుల భేటీ**

అమెరికా, ఇరాన్ మధ్య రెండో విడత చర్చల కోసం ఇస్లాబాద్‌లో దౌత్యవేత్తలు తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇరాన్ ఓడరేవులను దిగ్బంధిస్తానని అమెరికా చేసిన హెచ్చరిక, దానికి ప్రతిగా మధ్యప్రాచ్యం అంతటా లక్ష్యాలపై దాడులు చేస్తానని ఇరాన్ చేసిన ప్రకటన నేపథ్యంలో రెండో విడత చర్చలపై ఉత్కంఠ నెలకొంది. రాబోయే రెండు రోజులలో ఇరాన్‌తో సంప్రదింపులు జరుగుతాయని, వాటికి ఇస్లామాబాదే వేదిక అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పిన విషయం తెలిసిందే. చర్చలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ కూడా చెప్పారు. పాకిస్తాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్‌తో మాట్లాడానని ఆయన తెలిపారు.ఇదిలావుండగా దశాబ్దాల విరామం తర్వాత తొలిసారిగా ఇజ్రాయిల్, లెబనాన్ రాయబారుల మధ్య వాషింగ్టన్‌లో చర్చలు జరిగాయి. ఇవి మంచి ఫలప్రదంగా సాగాయని అమెరికా విదేశాంగ శాఖ చెప్పింది. ఉగ్రవాద హెజ్బొలా గ్రూపు నుంచి లెబనాన్‌కు విముక్తి కల్పించాలని ఇరు పక్షాలు అభిప్రాయ పడ్డాయని ఇజ్రాయిల్ రాయబారి ఎచిల్ లైటర్ తెలిపారు. సమావేశం నిర్మాణాత్మకంగా జరిగిందని లెబనాన్ రాయబారి నాదా హమదేహ్ మొవాద్ అన్నారు. అయితే ఇజ్రాయిల్, హెజ్బొల్లాల మధ్య జరుగుతున్న ఘర్షణకు ముగింపు పలకాలని ఆయన కోరారు.

**రష్యా నుంచి పెరిగిన ఇంధన దిగుమతులు**

పశ్చిమాసియా యుద్ధం, అంతర్జాతీయ ఇంధన సరఫరాలలో ఏర్పడిన ఆటంకాల నేపథ్యంలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. గత నెలలో రష్యా నుంచి మన దేశం పెద్ద ఎత్తున ముడి చమురును కొనుగోలు చేసింది. తద్వారా భారత ఇంధన దిగుమతుల వ్యూహంలో మార్పులు జరిగాయి. మీడియా వార్తల ప్రకారం రష్యా నుంచి మార్చిలో మన దేశం రూ.58,229 కోట్ల విలువైన ముడి చమురును కొనుగోలు చేసింది. అంతర్జాతీయ చమురు ధరలు పెరుగుతున్న సమయంలో దిగుమతులు రెట్టింపుకు పైగా పెరగడం గమనార్హం. అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా భారత్ తన ఇంధన వ్యూహాన్ని సర్దుబాటు చేసుకుంటోందని ఈ పరిణామం రుజువు చేస్తోంది. ఫిబ్రవరిలో రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు పడిపోయిందని, అయితే అది మార్చిలో గరిష్ట స్థాయికి చేరుకున్నదని సెంటర్ ఫర్ రిసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) సంస్థ తెలిపింది. గత నెలలో రష్యా నుంచి శిలాజ ఇంధనాలను కొనుగోలు చేసిన దేశాలలో భారత్ రెండో స్థానంలో నిలిచింది. వీటిలో 91 శాతం వాటా ముడి చమురుదే. దీనితో పాటు బొగ్గు, పెట్రోలియం ఉత్పత్తులను కూడా భారత్ కొనుగోలు చేస్తోంది.

**19 వరకే ఇరాన్ చమురు అమ్మకాలు గడువు పొడిగించం : అమెరికా**

సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ నౌకలలో ఉన్న చమురును విక్రయించుకునేందుకు ఇచ్చిన గడువును పొడిగించే ప్రశ్నే లేదని అమెరికా స్పష్టం చేసింది. ఇరాన్ చమురు నౌకల ప్రయాణానికి అమెరికా ఈ నెల 19వ తేదీ వరకూ తాత్కాలిక వెసులుబాటు ఇచ్చింది. దానిని పొడిగించే ఉద్దేశం లేదని, ఇరాన్‌పై ఒత్తిడిని కొనసాగిస్తామని ట్రంప్ ప్రభుత్వం తెలిపింది. ఇరాన్ ఇంధన ఎగుమతులకు ఈ నెల 19వ తేదీ వరకూ ఇచ్చిన వెసులుబాటును పొడిగించే ఉద్దేశం లేదని అమెరికా ఆర్థిక మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో తెలియజేసింది. అంతేకాక కఠినతరమైన నిబంధనలను విధించబోతున్నామంటూ అంతర్జాతీయ ఆర్థిక సంస్థలకు సంకేతాలు పంపింది. అందుబాటులో ఉన్న అన్ని అధికారాలు, సాధానాలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకుంటా మని చెప్పింది. ఇరాన్ లావాదేవీలను కొన సాగించే విదేశీ బ్యాంకులపై సెకండరీ ఆంక్షలు విధించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. ఇప్పటికే నౌకలలో నింపిన ఇరాన్ చమురును, పెట్రో కెమికల్ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు గత నెలలో అమెరికా అనుమతి ఇచ్చింది. యుద్ధ సమయంలో అంతర్జాతీయంగా సరఫరాల ఒత్తిడి తలెత్తకుండా చూసేందుకు గతంలో విధించిన ఆంక్షలను తాత్కాలికంగా ఎత్తివేసింది. దీంతో 140 మిలియన్ బ్యారల్స్ చమురు రవాణాకు మార్గం సుగమమైంది.